సాక్షి
బాపట్ల
బుధవారం, 31, మే, 2023



ఉపాధి కార్యాలయం తనిఖీ

పిట్టలవానిపాలెం: ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. కూలీలకు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,300 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష కేంద్రం పరిశీలన



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఎపికైన అభ్యర్థులకు జూన్ 3 నుంచి జూన్ 10 వరకూ మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్, పరీక్షల కో–ఆర్డినేషన్ అధికారి జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం పరీక్షలు జరిగే పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను మొత్తం 692 మంది అభ్యర్థులు రాస్తారని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందని వివరించారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9–45 గంటల లోపు మాత్రమే అనుమతిస్తామని వెల్లడించారు.

కేవీకేలకు డ్రోన్లు



గుంటూరు రూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో రైతులకు అధిక ఆదాయాన్ని అందించటం లక్ష్యంగా ప్రతి ఒక్కరం కృషిచేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విశ్వవిద్యాలయం పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలకు వ్యవసాయ డ్రోన్‌లను అందజేశారు. నగర శివారుల్లోని లాంఫాంలో ఎస్సీ, ఎస్టీ ప్లాన్, టారి జోన్‌టిన్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేసేందుకు కృషిచేయాలన్నారు. డ్రోన్‌ల ద్వారా వ్యవసాయంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పొన్నపల్లి వీఆర్వో

రూ.18 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



పొన్నపల్లి వీఆర్వో స్వాతి

చెరుకుపల్లి(రేపల్లె): లంచం తీసుకుంటుండగా వీఆర్వోను ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటన చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో జరిగింది. ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, సత్యానంద్ కథనం ప్రకారం.. గుళ్లపల్లికి చెందిన వాగు దినేష్ కుటుంబ సభ్యులకు పొన్నపల్లిలో 1.50 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఈనెల 24న పొన్నపల్లి వీఆర్వో నీలం స్వాతిని సంప్రదించారు. దీనికి రూ.20 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను అంత సొమ్ము ఇచ్చుకోలేనని ఎంత బతిమిలాడినా వీఆర్వో స్వాతి ఒప్పుకోలేదు. ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరికి రూ.18వేలు ఇస్తే ఆన్‌లైన్ చేసేందుకు వీఆర్వో ఒప్పుకున్నారు. ఈ క్రమంలో దినేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పొన్నపల్లిలోని గ్రామ సచివాలయంలో దినేష్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా వీఆర్వో స్వాతిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ అధికారులు వివరించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ నియమితులయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న కళావతమ్మను ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళవారం జరిగిన ప్రమోషన్స్‌లో ఆమె విజయవాడ నుంచి గుంటూరు నర్సింగ్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. గుంటూరుకు చెందిన డాక్టర్ రాధారమణశ్రీ గతంలో గుంటూరు నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

చదువుల ఒడి మురిసిపోతోంది..



గణపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (నాడు)



గణపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (నేడు)

- నాడు.. నేడుతో పాఠశాలలకు కార్పొరేట్ హంగులు
- జిల్లాలో వేగవంతంగా నిర్మాణాలు
- రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు ఐదో స్థానం



అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (నాడు)



అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (నేడు)

బాపట్ల అర్బన్: చదువులమ్మ పిలుస్తోంది.. అమ్మ ఒడి మురిసిపోతోంది.. కార్పొరేట్ హంగులు పులకింపజేస్తున్నాయి.. పాఠశాలలను చూసి తల్లిదండ్రుల గుండె ఉప్పొంగుతోంది. ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు ఇక బంగారమేనని తరగతి గది సంబరపడుతోంది. నాడు–నేడు ద్వారా నూతన సొబగులు దిద్దుకున్న పాఠశాలలు.. ఇది కదా విద్యకు నిజమైన అభిషేకమంటూ ప్రభుత్వానికి ప్రణామం చేస్తోంది. విద్యాసంస్కరణలను ఎద్దేవా చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబుకు గుబులు పట్టుకుంది. మళ్లీ మేనిఫెస్టోలో అబద్ధాలను వండి, తల్లికి వందనమని నామం పెడతానంటే నమ్మే పరిస్థితి లేదని.. విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

నాడు– నేడు పనులు ఇలా..

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మన బడి నాడు– నేడు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తొలి విడతలో రూ.102 కోట్లు వెచ్చించి 481 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలలను కలుపుకుని మొత్తం 543 సంస్థల్లో నాడు– నేడుతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం రూ.189.87 కోట్ల నిధులు కేటాయించింది. ఇప్పటి వరకు రూ. 69.41 కోట్లు ఖర్చు చేశారు. అందులో భాగంగా మొత్తం 777 పనులు ఉన్నాయి. అదనపు గదుల 225 పాఠశాలల్లో 474, కాంపౌండ్ వాల్ 78గా పనులు ఉన్నాయి. నాడు– నేడు పనుల నిర్వహణలో రాష్ట్రంలో బాపట్ల జిల్లా ఐదో స్థానంలో ఉంది.

తొమ్మిది మందితో మానిటరింగ్ కమిటీ

ప్రభుత్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు– నేడు రెండో విడత అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా తొమ్మిది మంది సిబ్బందితో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఆయా పనులను ఈ కమిటీ ద్వారానే మానిటరింగ్ చేస్తారు. ఈ కమిటీ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించడంతోపాటు ఎక్కడైనా సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నాయో పరిశీలిస్తుంది. ఇలా గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతుంది.

వేగవంతంగా పనులు

జిల్లా వ్యాప్తంగా రెండో విడత ఎంపిక చేసిన పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలల్లో నాడు– నేడు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తారు.

– పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వర రావు, నాడు– నేడు నోడల్ ఆఫీసర్, బాపట్ల జిల్లా



రేపల్లె వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తదితరులు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుంటూరు వెస్ట్: వచ్చే నెల 2న గుంటూరులోని చుట్టుగుంట ప్రాంతంలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, తూర్పు శాసన సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, డీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము) తదితరులు, అర్బన్ ఏఎస్పీ సుప్రజ, జీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ పెద్ది రోజా, జిల్లా అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పార్కింగ్ ప్రదేశం, సభాస్థలి, ప్రజలంతా చూసేందుకు ఎల్ఈడీ స్క్రీన్స్, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించామని, తానూ నిరంతరం పర్యవేక్షిస్తున్నానని కలెక్టర్ వివరించారు.

కొత్త వ్యక్తుల కదలికలపై

నిఘా అవసరం

- గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో మహిళా పోలీసులే కీలకం
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: కొత్త వ్యక్తుల కదిలికలపై పోలీస్ ప్రత్యేక నిఘా అవసరమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో మహిళా పోలీసులే కీలకమని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు విధులలో నిబద్ధత కలిగి ఉండే విధంగా మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్ వెబ్ సైట్ లో కొత్తగా 20 టాస్కలను పొందుపరిచినట్లు తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు సీసీ కెమెరాల లిస్ట్ అవుట్ చేసి వాటి పని తీరును గూగుల్ షీట్స్‌లో పొందుపర్చాలని సూచించారు. బాల్య వివాహాలు, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గురించి, ఎక్కువ రోజుల పాటు తాళాలు వేసి ఉన్న ఇళ్లు, నంబర్ ప్లేట్ లేని వాహనాలు గురించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్, ప్రభుత్వ జాబ్ మోసాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఒంటరి మహిళలను గుర్తించి వారి వద్ద విలువైన వస్తువులు జాగ్రత్త చేసుకునేలా కృషి చేయాలన్నారు. మహిళలు, బాలబాలికల మిస్సింగ్ కేసుల దర్యాప్తులో ఎస్‌హెచ్‌ఓలకు సహకరించాలని చెప్పారు. రహస్యంగా బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే వివాహం నిలుపుదల చేసేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీసీఆర్‌బీ సీఐ పి.మురళీకృష్ణ, ఐటీ కోర్ ఎస్ఐ సీజే భరత్ పాల్గొన్నారు.

తీరప్రాంతంలో గస్తీ ముమ్మరం చేయాలి

బాపట్ల టౌన్: తీరప్రాంతంలో గస్తీ ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈనెల 28,29 తేదీల్లో సూర్యలంక సముద్రతీరంలో కొట్టుకుపోతున్న యాత్రికులను కాపాడిన రూరల్, మెరైన్ సిబ్బంది, గజ ఈతగాళ్ళను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సూర్యలంక మెరైన్ సీఐ జి.సుబ్బారావు, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తుత్తి హామీల చంద్రబాబును ప్రజలు నమ్మరు

మంత్రి మేరుగ నాగార్జున



కొల్లూరులో వైఎస్సార్ సీపీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఉత్తుత్తి హామీలను ప్రజలెవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి ఎన్నికల అనంతరం పారిపోయిన చంద్రబాబు, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు ఉత్తుత్తి హామీలతో వస్తున్నారని విమర్శించారు. 2014 ఎన్నికలకు ముందు 610 హామీలతో మేనిఫెస్టోను ప్రకటించి అధికారం చేజిక్కించుకున్నాక మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మరోమారు మేనిఫెస్టో పేరుతో ప్రజల ముంగిటకు వెళ్లేందుకు అనర్హుడని చెప్పారు. చంద్రబాబు వంటి దొంగ రాజకీయాలకు పనికి రాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడులో 15 వేలకు మించి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు లేకపోవడం ఆ పార్టీ ప్రజలలో విశ్వాసం కోల్పోయిందనడానికి నిదర్శనమని వివరించారు. సంక్షేమ పథకాలు అందజేస్తూ, ప్రజారంజక పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బాబు హయాంలో చేసిన అప్పులను కూడా వైఎస్ జగన్ తీరుస్తున్నట్లు చెప్పారు. ప్రకటించిన హామీలను 98.50 శాతం అమలు చేసినట్లు తెలిపారు. రూ.లక్షల కోట్లు డీబీటీ రూపంలో లబ్ధిదారులకు చేర వేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారం కోసం ప్రజలను మోసగించేందుకు సిద్ధమవుతున్న పగటి వేషగాళ్లతో కూడిన టీడీపీ తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్ర ప్రజలు టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. చెప్పడంతో పాటు, చెప్పిన హామీలను చెప్పినట్లు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మురాల రాంబాబు, కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల్లంక సొసైటీ చైర్మన్ తూము నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కమ్మెల సాంబశివరావు, యలవర్తి సురేష్, అయిల సుబ్బారావు, శింగం కృష్ణప్రసాద్, ఉప్పు శ్రీనివాసరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, చందోలు డేవిడ్ విజయకుమార్, దున్న మేరిసుబాబు, గాజుల భాను, మాతంగి రత్నకుమార్, గాజుల శ్రీనివాసరావు, దోనే ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

నాటికల ద్వారా సమాజంలో మార్పు

- ముగిసిన కళా పరిషత్ నాటిక పోటీలు
- అతీతం నాటికకు మొదటి బహుమతి



నాటిక పోటీలో విజేతలకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పర్చూరు(చినగంజాం): నాటికల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కళానికేతన్ కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన పోటీలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇక్కడ ప్రదర్శించిన 12 నాటికల్లో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'అతీతం' నాటికకు మొదటి బహుమతి లభించింది. సాఫ్ట్‌వేర్ పేరుతో కుటుంబ బంధాలను వదలి ఇతర దేశాలకు వలస వెళ్లిపోతున్నాడు. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. చివరికి డబ్బు కంటే ఆప్యాయత, అనురాగాలు, కుటుంబ గౌరవం, మర్యాదలే ముఖ్యమని చాటి చెప్పే ఇతివృత్తంతో ఈ నాటిక సాగింది. ప్రస్తుత ధోరణలకు అద్దం పట్టింది. రెండో బహుమతి హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారి 'మనసున మనసై' నాటికకు లభించింది. రసఝరి పొన్నూరు వారి 'గుర్తు తెలియని శవం' నాటికకు మూడో బహుమతి వరించింది. కపిరాజు నాటికకు జ్యూరీ అవార్డు లభించింది. అతీతం నాటికలో రాఘవ పాత్ర పోషించిన ఎన్.రవీంద్రారెడ్డికి ఉత్తమ నటుడిగాను, కమనీయం నాటికలో రాగసుధ పాత్రను పోషించిన గుడివాడ లహరికి ఉత్తమ నటిగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. ఉత్తమ హాస్య నటుడిగా 'పక్కింటి పెళ్లాం' నాటికలో సీతాపతి పాత్రధారి శేషయ్య ఎన్నికయ్యాడు. ఉత్తమ రచనగా 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక రచయిత టీ వెంకటేశ్వర్లుకు దక్కింది. ఉత్తమ దర్శకత్వంగా 'కపిరాజు' నాటిక దర్శకుడు పి.దివాకర్ ఫణీంద్ర ఎంపికైనట్లు నిర్వాహకులు చిట్టినేని సాయిబాబు, కొల్లా శ్రీనివాసరావు, బుచ్చయ్య చౌదరి వివరించారు. న్యాయ నిర్ణేతలుగా జెట్టి రాంబాబు, నుసుము నాగభూషణం వ్యవహరించారు.

బాధితులకు సత్వర న్యాయం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పర్యవేక్షణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పక్కన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసులలో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై నిఘా, పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక స్పందన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు సకాలంలో పరిహారం అందించాలని కోరారు. జిల్లా ఏర్పడిన తరువాత వంద కేసులు నమోదైనట్లు చెప్పారు. కేసులలో పురోగతి సాధించడానికి డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు ప్రతి నెలా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. కేసుల్లో రాజీపడే వాటిపై నిశిత పరిశీలన చేయాలని చెప్పారు. బాధితులను ప్రలోబపెట్టే అవకాశం ఉన్నందున రాజీ కేసులను పునఃపరిశీలించాలని సూచించారు. ప్రతి నెలలో ఒక రోజు అన్ని మండలాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని విధిగా నిర్వహించాలని చెప్పారు. బాపట్ల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేటికి ఆధార్ కార్డులు లేని ఎస్సీ, ఎస్టీల కోసం మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బాపట్ల మండలంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, డీఆర్ఓ లక్ష్మీశివజ్యోతి, ఆర్డీఓలు జి.రవీంద్ర, పార్థసారథి, పి.సరోజిని, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి జె.రాజదెబోరా పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు విస్తృతంగా రుణాలు

మహిళా సాధికారత కొరకు పొదుపు మహిళలకు విస్తృతంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా చెప్పారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో 9 ప్రభుత్వ శాఖలు అనుబంధంగా 1,19,108 మంది మహిళలకు రూ.1,495.97 కోట్ల రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఉండేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని పొదుపు మహిళల పిల్లలలో నిరుద్యోగులుంటే గుర్తించాలని చెప్పారు. మొదటి దశలో 100మంది యువతను ఎంపిక చేసి వారి జీవితాలు మార్చడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాపట్ల జిల్లాలోని సూర్యలంక, నిజాంపట్నం, చీరాల ఓడరేవు ప్రాంతాలలో వ్యాపారం ప్రారంభించే అవకాశాలపై ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ బి.అర్జున్ రావు, ఎల్‌డీ ఎం. శివరామకృష్ణ, పరిశ్రమల శాఖ జీఎం మదన్‌మోహన్, మత్స్యశాఖ జేడీ పి.సురేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

పాల వెల్లువ సమర్థంగా అమలు చేయాలి

జిల్లాలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమూల్ ద్వారా పాల సేకరణకు కొత్తగా 97 కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పాల సేకరణ గ్రామాల్లో రైతులకు జూలైలో డి.ఆర్.డి.ఎ. ద్వారా పాడి గేదెలు ఇస్తామని చెప్పారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, జిల్లా సహకార అధికారి రామారావు, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, ఆముల్ సంస్థ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

చారిత్రాత్మకం.. ఇళ్ల పట్టాల పంపిణీ

- లబ్ధిదారులు సంతోషం వెలకట్టలేనిది
- ఏ ముఖ్యమంత్రి చేయనిది జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు
- నవులూరులో 565 మందికి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే
- కుటుంబాలతో సహా తరలివచ్చిన లబ్ధిదారులు


లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వద్దకు వెళ్లి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ఏ ఒక్క పేదకుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఇళ్ల పట్టాల పంపిణీ నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. నగరంలో నవులూరు లేఅవుట్‌లో మంగళవారం మంగళగిరి గండాలయపేటకు చెందిన 565 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకే పట్టాల పంపిణీ ప్రారంభం కాగా లబ్ధిదారులు కుటుంబాలతో సహా లేఅవుట్‌కు తరలిరావడంతో కోలాహలంగా మారింది. చంటిబిడ్డలను ఎత్తుకుని మరీ తరలివచ్చిన లబ్ధిదారులు పట్టాలు అందుకుని సంతోషం వ్యక్తం చేశారు. టిఫిన్లు సైతం లేఅవుట్‌కు తెచ్చుకోవడం విశేషం. ఎండ తీవ్రంగా ఉంటుదనుకున్న సమయంలో ఒక్కసారిగా వాతావరణం ఆహ్లాదంగా చల్లగా మారడంతో లబ్ధిదారులు ఆనందంతో పట్టాలు అందుకుని జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు నిండిన సందర్భంగా వాతావరణం మారిందని ఆనందం వ్యక్తం చేశారు. పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దశాబ్దాలుగా ఏ ముఖ్యమంత్రి చేయని ఇళ్ల పట్టాలు పంపిణీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. పట్టాలు తీసుకున్న లబ్ధిదారులంతా ఎంతో సంతోషంతో తమకు సొంతింటి కలనేరవేరుతుందని ఆనందం వ్యక్తం చేస్తూ జగనన్న అండగా నిలుస్తామని స్పష్టం చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, డీసీపీ మహాలక్ష్మి దొర, ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్ పర్సన్ దొడ్డక శివపార్వతి, జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదామ్ పాల్గొన్నారు.

మనోడికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

- ఓక్‌విల్లే ఫెస్టివల్స్ ఆఫ్ ఫిల్మ్ అండ్ ఆర్ట్‌లో ప్రదర్శనకు ఎంపిక
- ఇప్పటికే 37 అవార్డులు గెలిచిన సినిమా
- రెండో సినిమా 'ఐడీ'తో ఫిల్మ్ ఫెస్టివల్ సర్క్యూట్‌లో సంచలనం
- నిర్మాతల్లో ఒకరు హర్ష ప్రతాపనేని
- వృత్తి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, ప్రవృత్తి సినిమా

తెనాలి: తెలుగు సినిమా రేంజ్ పెరిగింది.. పాన్ ఇండియా స్థాయికి ఎదిగింది. అందివచ్చిన టెక్నాలజీతో దర్శక నిర్మాతలు వెండితెరపై అద్భుతాల్ని ఆవిష్కరిస్తున్నారు. అదే బాటలో నవతరం సత్తాను చాటుతోంది. వినూత్న ఆలోచనలు, సరికొత్త ప్రయోగాలతో కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నారు. అవార్డుల పోటీలోనూ ముందంజలో ఉంటున్నారు. 'గతం' సినిమా మేకర్స్ దీనికి నిదర్శనం. డార్క్ మిస్టరీ థ్రిల్లర్‌గా తీసిన 'ఐడీ'తో ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డును గెలుచుకున్నారు. సినిమా నిర్మాతల్లో ఒకరైన హర్ష ప్రతాపనేని తెలుగు వాడు...తెనాలి వాడు కావడం విశేషం!

విడుదల కాకముందే అవార్డు

ఓటీటీ బ్లాక్ బస్టర్ మూవీ 'గతం' మేకర్స్ రూపొందించిన రెండో తెలుగు సినిమా 'ఐడీ'. టాలీవుడ్, హాలీవుడ్ టెక్నీషియన్లు పనిచేశారు. చిత్రోమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తీసిన సినిమాకు కిరణ్‌రెడ్డి కొండమడుగుల దర్శకత్వం వహించారు. హర్ష ప్రతాపనేని, సృజన్ యరబోలుతో కలసి సుభాష్ రావాడ, భార్గవ పోలుదాసు నిర్మాతలుగా వ్యవహరించారు. భార్గవ పోలుదాసు, రాకేట్ గలేటీ ప్రధాన పాత్రల్లో నటించారు. 'క్షణం', 'గూఢచారి' సినిమాల ఫేం శ్రీచరణ్ పాకాల సంగీతం సమకూర్చారు. హాలీవుడ్ డీపీ హోరాసియో మార్టినెజ్ సినిమాటోగ్రఫీ అందించగా, కాటెరినా ఫిక్కార్డో ప్రొడక్షన్ డిజైన్ పనులను పర్యవేక్షించగా, ఛోటా కె.ప్రసాద్ ఎడిటింగ్ చేశారు. విడుదల కాకముందే ఈ సినిమా దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో అత్యున్నత గౌరవాన్ని అందుకుంది. విమర్శకుల ప్రశంసలు పొందిన కన్నడ చిత్రం 'చార్లీ 777'ను వెనక్కునెట్టి, 'బలగం', 'సీతారామం' వంటి తెలుగు సినిమాలకు దీటుగా 'ఐడీ' సినిమా దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును గెలుచుకుంది. మరోవైపు ఫిల్మ్ ఫెస్టివల్ సర్క్యూట్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 37 అవార్డుల్ని అందుకుంది. 31 అఫీషియల్ సెలక్షన్స్‌ను సాధించి, 5 ఆనరబుల్ మెన్షన్స్‌ను అందుకుంది. నాలుగు నామినేషన్లను పొందింది. త్వరలో కెనడియన్ స్క్రీన్ అవార్డు (ఆస్కార్ తరహాలో)లకు క్వాలిఫైయింగ్ ఫెస్టివల్ అయిన ప్రముఖ ఓక్‌విల్లే ఫెస్టివల్స్ ఆఫ్ ఫిల్మ్ అండ్ ఆర్ట్‌లో ప్రదర్శించనున్నారు. అంతర్జాతీయ అవార్డు వేడుకల్లో సత్తా చాటిన 'బలగం' సినిమా దాదాసాహెబ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఉత్తమ సంగీతం' అవార్డును అందుకోగా, 'సీతారామం' సినిమా 'ఉత్తమ చిత్రం'గా అవార్డును అందుకుంది. ఐడీ చిత్రం 'ఉత్తమ ఎడిటింగ్'అవార్డును గెలుచుకుంది.

వినూత్న కథాంశం

'మీరు ఒక రోజు నిద్రలేచాక, మిమ్మల్ని ఎవరూ గుర్తించకపోతే...'అనే విచిత్రమైన ఆలోచన ఐడీ సినిమా కథాంశం. సహ నిర్మాతగా వ్యవహరించిన హర్ష ప్రతాపనేని తండ్రి పి.వి. గణేష్ స్వస్థలం తెనాలి సమీపంలోని జంపని. ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా ఖమ్మంలో చేస్తున్నారు. తల్లి మంజులాదేవి గృహిణి. తండ్రి ఉద్యోగం కారణంగా వివిధ ప్రదేశాల్లో చదివిన హర్ష, హైదరాబాద్‌లో బీటెక్ చేశాడు. ఒక్లహామా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చేసి, అమెరికాలోని ప్రతిష్టాత్మక జేపీ మోర్గాన్స్ ఛేజ్ బ్యాంక్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తున్నారు. చదివే రోజుల్లో క్లాస్‌మేట్ కిరణ్‌తో కలసి లఘుచిత్రాలు తీసిన హర్ష, ఉద్యోగంలో కొనసాగుతూనే కిరణ్‌తో కలిసి 'గతం' సినిమా తీశారు. సహ నిర్మాత, సహ దర్శకుడు, సహ రచయితగా వ్యవహరించాడు. గతం విజయంతో ఇప్పుడు 'ఐడీ'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు.


హర్ష ప్రతాపనేని

తీరప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ శ్రద్ధ

- కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణాలు
- దిండిలో రూ.180కోట్లతో ఆక్వా ఇంటిగ్రేటెడ్ పార్కు నిర్మాణం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: తీరప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నిజాంపట్నం మండలం దిండి ప్రాంతంలో 275 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్లతో ఆక్వా ఇంటిగ్రేటెడ్ పార్క్, రీసెర్చ్ ల్యాబ్‌కు శంకుస్థాపనలు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎప్పటి నుంచే పెండింగ్‌లో ఉన్న పలు రోడ్ల నిర్మాణానికి రూ.75 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ముఖ్యంగా నిజాంపట్నం తుంగభద్ర డ్రెయిన్‌పై రూ.2.5కోట్లతో వంతెన, కొత్తపాలెంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.10కోట్లు, నిజాంపట్నం–సముద్రం నుంచి గ్రామంలోకి వచ్చేందుకు జెట్టీ ఏర్పాటుకు, రోడ్డుకు రూ.25కోట్లు, రేపల్లె– పీవీ పాలెం ప్రధాన రహదారికి రూ.10 కోట్లు, చెరుకుపల్లి మండలంలోని తుమ్మలపాలెం పంచాయతీలో నాలుగు గ్రామాలను అనుసంధానం చేసే ఏవీరెడ్డిపాలెం– డీవీ రెడ్డి పాలెం రోడ్డుకు రూ.2 కోట్లు, రేపల్లె– నిజాంపట్నం– నిజాంపట్నం పోర్టు వరకు రోడ్డుకు రూ.35 కోట్లు, రేపల్లె– తుమ్మల– గంగడిపాలెం రోడ్డుకు రూ.10 కోట్లు, నగరం మండలంలోని దూళిపూడి నుంచి చెరుకుపల్లి మండలంలోని కనగాల రహదారి నిర్మాణంకు రూ.6.5కోట్లు, చందోలు– నిజాంపట్నం పోర్టు రూ.3.5కోట్లు, పెనుమూడి–లంకెవానిదిబ్బ కరకట్ట రోడ్డుకు రూ.5 కోట్లు, రేపల్లె– అడవులదీవి– కొత్తపాలెం రోడ్డుకు రూ.5కోట్లు, నగరం– పూడివాడ రోడ్డుకు రూ.2 కోట్లు నిధులు కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అదే విధంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో తాగునీటి ఎద్దడి తగ్గించేందుకు రూ.111 కోట్లు విడుదల చేశారన్నారు. గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలోని తాగునీరు, రహదారులు, వివిధ అభివృద్ధి పథకాలతో పాటు నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలకు అత్యధికంగా రూ.800 కోట్లు కేటాయించినట్లు వివరించారు. తీర ప్రాంతమైన రేపల్లె, నిజాంపట్నంపై ప్రత్యేక మక్కువ చూపుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌దే


కేక్ కత్తిరిస్తున్న వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి

పిట్టలవానిపాలెం: అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నూరు శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు యేట్ర అశ్విని రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పిట్టువారిపాలెంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఆమె మాట్లాడతూ ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రానున్న 30 ఏళ్ల పాటు జగనన్ననే సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కేక్ కత్తిరించి మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యేట్ర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెన్సిళ్లపై హీరో కృష్ణ జీవిత చరిత్ర

స్వర్ణ గ్రామ యువతి ఘనత


పెన్సిల్ పటంతో మహిత

కారంచేడు: సూపర్ స్టార్ కృష్ణ జీవిత చరిత్ర పెన్సిల్ పటంపై చెక్కి ఓ యువతి అబ్బుర పరుస్తోంది. వివరాలు.. మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం నరసింహారావు కుమార్తె అన్నం మహిత డిగ్రీ చదువుతూ కళాఖండాలపై ఉన్న మక్కువతో పెన్సిల్ లిడ్‌లపై అనేక కళాఖండాలను అందంగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటి వరకు భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను లిడ్‌పై చెక్కింది. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, అమరజీవి పొట్టి శ్రీరాములు, మాజీ సీఎం ఎన్టీఆర్, పుట్టపర్తి సాయిబాబా, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి వంటి అనేక మంది జీవిత చరిత్రలను పెన్సిల్ లిడ్‌లపై చెక్కి అనేక మంది మన్ననలు పొందింది. ప్రస్తుతం మే 31న సినీ హీరో కృష్ణ జయంతి పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రను పెన్సిళ్లపై చెక్కింది. అందంగా ఫ్రేమ్ కట్టించి కృష్ణ కుమారుడు హీరో మహేష్‌బాబుకు బహూకరించనున్నట్లు ఆమె 'సాక్షి'కి తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

సంతమాగులూరు(అద్దంకి): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉంటాయని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలపై నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం, ప్రోత్సహించడం నేరమని చెప్పారు. బాల్య వివాహాలు జరకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని వివరించారు. పోక్సో చట్టం ప్రకారం బాలికను వివాహం చేసుకున్న యువకుడికి 20 ఏళ్లు, 16 ఏళ్లలోపు బాలికను వివాహం చేసుకున్న వరుడికి పదేళ్లు కఠిన కారాగార శిక్ష పడుతుందని తెలిపారు. వివాహానికి హాజరైన వారికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చింతల పేరయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ సుధ, బల్లికురవ ఎంపీపీ హేమలత, సంతమాగులూరు ఎంపీడీఓ కృష్ణ, ఎంఈఓ కోటేశ్వరరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాహిత్య, సమైక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మీశేషు, ఏపీఎం మస్తాన్‌రావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రవీణ్‌కు కాంస్య పతకం



మెడల్ అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

చీరాల రూరల్: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చీరాల సాయి కాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్ కాంస్య పతకం దక్కింది. హైదరాబాద్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ఐఎండబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని ఇండియా పోస్ట్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన పోటీలలో ప్రవీణ్‌కుమార్ పతకం సాధించాడు. స్నాచ్ 40 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ 55 కేజీలు ఎత్తి మూడో స్థానం నిలిచాడు. తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రుతి నుంచి ప్రవీణ్ మెడల్ అందుకున్నాడు. నెల రోజుల క్రితం రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. చినగంజాం మండలం చింతగుంపల గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో పనిచేస్తున్న ప్రవీణ్‌ను బ్యాంక్ మేనేజర్ అబ్రహం, సిబ్బంది సునీల్, చిరంజీవితో పాటు ఇతర సిబ్బంది అభినందించారు.

మార్టూరులో భారీ వర్షం


భారీ వర్షంతో నీట మునిగిన ఉప్పు కొఠారులు

- హైవేపై నిలిచిన నీరు
- ప్రయాణికుల అవస్థలు


జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

మార్టూరు: ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం మంగళవారం పడింది. ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య భారీ వర్షం పడింది. స్థానిక స్వప్న హోటల్ నుంచి కూరగాయల మార్కెట్, జొన్నతాళి స్టేజీ వరకు జాతీయ రహదారిపై సుమారు 2 అడుగుల మేర నీరు నిలిచింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైవే సిబ్బంది ప్రవాహం ఎక్కువగా ఉన్నచోట బారికేడ్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనాలను మళ్లిస్తూ వాహనదారులను, ప్రయాణికులను అప్రమత్తం చేశారు. కొణిదెన రోడ్డులోని ఓ టుబాకో కంపెనీలో సుమారు 500 పొగాకు బేళ్ల వర్షపు నీటిలో మునిగిపోయాయి. రోడ్లు పక్కన ఉంచిన హోర్డింగ్‌లు, రేకులషెడ్లు గాలికి పడిపోగా 2 గంటలు పాటు విద్యుత్, సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన ఉప్పు కొఠారులు..

చినగంజాం: మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి ఉప్పు కొఠారులు నీట మునిగాయి. సుమారు 1500 ఎకరాల్లో కొఠారులు వర్షపు నీటితో నిండి పోయాయి. సుమారు 40 వేలు బస్తాల ఉప్పు నీటిపాలయినట్లు రైతులు చెబుతున్నారు.

జిల్లా ఎంపీపీల సంఘం గౌరవాధ్యక్షురాలిగా శాంతిబాయి



మార్టూరు: ఆంధ్రప్రదేశ్ మండల పరిషత్ అధ్యక్షుల సంఘం బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షురాలిగా మార్టూరు ఎంపీపీ భూక్యా శాంతిబాయి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బాపట్లలో మంగళవారం నిర్వహించిన ఎంపీపీల జిల్లా సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ మేకల హనుమంతరావు ప్రకటించారు. ఈ సందర్భంగా శాంతిబాయిని మండల నాయకులు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

బస్టాండ్లలో ఖాళీ స్థలాల లీజుకు టెండర్లు

జిల్లా డీపీటీఓ విజయ్‌కుమార్‌రెడ్డి



అద్దంకి రూరల్: జిల్లా పరిధిలోని బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా డీపీటీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అద్దంకి బస్టాండ్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను 15 సంవత్సరాల లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో అద్దంకి, మార్టూరు, వేటపాలెం, ఇంకొల్లులో ఐదెకరాల స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ స్థలాల్లో వ్యాపార నిర్వహించేందుకు నియమాలు లేవని చెప్పారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు. అద్దంకి డిపోలో ఆదాయం లేకపోవటంతో కొన్ని రూట్లలో బస్సులు నడపలేకపోతున్నట్లు చెప్పారు. శ్రీశైలానికి రెండు అదనపు బస్సులు, అద్దంకి– నరసరావుపేట, అద్దంకి– వినుకొండకు మరో రెండు బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎం రామ్మోహనరావు పాల్గొన్నారు.

పెదకాకానిలో 3న మహాకుంభాభిషేకం

పెదకాకాని: స్థానిక శివాలయంలో జూన్ 3న మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఏపీ విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1 నుంచి 3వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్ల సారథ్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

2న జిల్లా స్థాయి అండర్-19 జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–19 యువకుల క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికను వచ్చే నెల 2వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్ పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. నవంబర్ 1, 2004 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 97042 53968 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అంగలకుదురులో భారీ చోరీ

తెనాలిరూరల్: మండల పరిధిలోని అంగలకుదురు గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఇంట్లోని వారు నిద్రిస్తుండగానే లోనికి ప్రవేశించిన దుండగులు భారరీ మొత్తంలో సొత్తు అపహరించుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ఆలపాటి సాంబశివరావు భార్య పద్మజ, తల్లి శేషమ్మతో కలసి నివసిస్తున్నాడు. ఇటీవల కుమార్తె, అల్లుడు రావడంతో అంతా కలసి ఈ ఇంట్లోనే ఉంటున్నారు. సోమవారం రాత్రి సాంబశివరావు విశాఖపట్నం వెళ్లగా మిగిలిన వారంతా ఇంట్లోనే ఉన్నారు. రాత్రి వీరంతా ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ప్రధాన డోరు పక్కన ఉన్న కిటికీ గ్రిల్ తొలగించి లోనికి వెళ్లిన వీరు గదుల్లోని ఇనుప లాకర్, బీరువా తెరచి అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందర వందరగా పడేశారు. 315 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. ఉదయం నిద్ర లేచేసరికి బీరువా, లాకర్ తెరచి ఉండడం, సామాన్లు చెల్లా చెదురుగా పడి ఉండడం చూసి చోరీ జరిగిందని ఇంట్లోని వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. రూరల్ ఎస్‌ఐ ప్రసన్నకుమార్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంట్లోని వారు రెండు వేర్వేరు గదుల్లో నిద్రిస్తుండగా కిటికీ గ్రిల్ తొలగించిన దుండగులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.15 లక్షల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు


మృతుడు భావని (వెంకటస్వామి)

బల్లికురవ: బైకుపై వెళ్తుండగా పిడుగుపాటుతో వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన మంగళవారం నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రామ్‌జనార్దన్ కాలనీకి చెందిన రాసగోరి భవాని(వెంకటస్వామి 55) ఆలయాల్లో పూజలు నిర్వహిస్తుంటాడు. స్థానికంగా నివాసం ఉండే ఎన్.పోలేశ్వరరావుతో పాటు బల్లికురవలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి బైకుపై హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భవాని పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన పోలేశ్వరరావును 108లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీ వేమన తెలిపారు.